ఘనంగా లక్ష్మీనర్సింహస్వామి తిరు వీధి సేవోత్సవం

స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 10 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామికి తిరువీధి సేవ అత్యంత వైభవంగా సాగింది. మంగళవారం సాయంత్రం స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించి స్వామివారిని గరుఢ వాహనంపై, అమ్మవారిని తిరుచ్చి వాహనంపై వేంచేపు చేసి తిరు మాఢవీధుల్లో ఊరేగించారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. స్వామివారికి కల్యాణోత్సవ సేవ అత్యంత వైభవంగా సాగింది. ప్రధానాలయం వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతు చేపట్టారు. ప్రధానాలయం ముఖ మండపంలో స్వామివారికి భక్తులతో సువర్ణ పుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం స్వామివారికి దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామికి ఆకు పూజ ఘనంగా జరిగింది. సుమారు 4వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.9,99,013 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

దివ్యాంగులు సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలి

- జాతీయ మేధో దివ్యాంగుల సాధికారిక సంస్థ రాష్ట్ర చీఫ్ కో ఆర్డినేటర్ శ్రీనివాసులు

సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్ కో ఆర్డినేటర్ శ్రీనివాసులు

సంస్థాన్ నారాయణపురం, సెప్టెంబర్ 10 : దివ్యాంగుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని జాతీయ మేధో దివ్యాంగ వ్యక్తుల సాధికారిక సంస్థ రాష్ట్ర చీఫ్ కో ఆర్డినేటర్ శ్రీనివాసులు అన్నారు. మండంలోని పుట్టపాక, నారాయణపురం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన దివ్యాంగుల శిబిరాల్లో ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు కావలసిన అవకాశాలను కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రణాళిక రూపొందించడం కోసం స్క్రీనింగ్ అండ్ ఐడెంటిఫికేషన్ క్యాంప్ నిర్వహించినట్లు తెలిపారు. యుడీఐడీ కార్డు వల్ల కలిగే ప్రయోజనాల గురించి దివ్యాంగులకు వివరించారు.

సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

- డీఏఓ గోపాల్

అడ్డగూడూరు మండలం ధర్మారంలో వరి పంటను పరిశీలిస్తున్న డీఏఓ గోపాల్

మోత్కూరు, సెప్టెంబర్ 10 : పంటల సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు పొందాలని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ అన్నారు. మండలంలోని పాటిమట్ల రైతు వేదికలో మంగళవారం జరిగిన దృశ్య శ్రవణ మాధ్యమానికి ఆయన హాజరై రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం పడుతున్న వర్షాల వల్ల పంటలకు సోకే చీడపీడలు, తెగుళ్ల నివారణకు సరైన యాజమాన్య పద్ధతుల కోసం వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలన్నారు. రైతులు నేరుగా ఎరువుల షాపులకు వెళ్లి తెగుళ్లతో సంబంధం లేని మందులు తెచ్చి వేయడం వల్ల ప్రయోజనం ఉండదని, పైగా ఆర్థిక భారం పడుతుందని తెలిపారు. రుణమాఫీ కాని, రేషన్ కార్డు లేని కుటుంబ సభ్యుల నిర్ధారణ ప్రక్రియను పరిశీలించారు. ఏడీఓ పద్మావతి, ఏఓ కీర్తి, ఏఈఓలు గోపీనాథ్, అశోక్, వేణు, రైతులు పాల్గొన్నారు.

అడ్డగూడూరులో క్షేత్ర ప్రదర్శన

అడ్డగూడూరు : మండలంలోని ధర్మారంలో పంటలను డీఏఓ గోపాల్ క్షేత్ర పరిశీలన చేశారు. పత్తి, వరి పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తాసీల్దార్ శేషగిరి, ఏఓ పాండురంగాచారి, ఏఈఓ నవనీత పాల్గొన్నారు.

గర్భిణులకు శుభ్రమైన పోషకాహారం అందించాలి

- జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి

గూడూరు అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి

బీబీనగర్, సెప్టెంబర్ 10 : అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, చిన్నారులకు శుభ్రమైన పోషకాహారం అందించాలని జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి అన్నారు. మండలంలోని అనంతారం, బీబీనగర్, గూడూరు అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఆమె సందర్శించి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలను ఉదయం 9గంటలకల్లా తెరిచి సాయంత్రం నాలుగు గంటల వరకు సేవలు అందించాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి సప్లయ్ చేసిన ఆహార పదార్థాలను చెక్ చేసుకున్న తర్వాత బయోమెట్రిక్ వేసి తీసుకోవాలని సూచించారు. కేంద్రాల్లో రోజూ ఆహార పదార్థాలను పరిశీలించాలని, పాడైపోయినవి ఉంటే తీసేయాలని అన్నారు. ఆరోగ్యలక్ష్మి పథకంలో భాగంగా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు వండిన పోషకాహారం కేంద్రంలోనే అందించాలని సూచించారు. ఆరు నెలల నుంచి మూడేండ్లలోపు చిన్నారులకు ప్రతి నెలా 1, 16 తేదీల్లో టేక్ హోమ్ రేషన్‌గా 16 గుడ్లు చెక్ చేసుకుని ఇవ్వాలన్నారు. పంపిణీ చేసిన తర్వాత లబ్ధిదారుల నుంచి పౌష్టికాహారం గుడ్ క్వాలిటీగా ఉన్నదని ఎక్నాలెడ్జ్‌మెంట్ తీసుకోవాలని తెలిపారు. ఈ నెల 30వరకు పోషణ మాసం కార్యక్రమాలు నిర్వహించి మంచి ఆహార, ఆరోగ్య అలవాట్లపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో భువనగిరి సీడీపీఓ శైలజ, సూపర్‌వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తన అలవర్చుకోవాలి : ఎస్ఓటీ డీసీపీ

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 10 : రౌడీషీటర్లు సత్ప్రవర్తన అలవర్చుకోవాలని ఎస్ఓటీ డీసీపీ రమణారెడ్డి అన్నారు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని 105 మంది రౌడీషీటర్లతో పట్టణంలోని ఓ గార్డెన్‌లో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దన్నారు. ప్రతి ఒక్కరూ మంచి ప్రవర్తన కలిగి సమాజంలో మంచి పేరు తెచ్చుకునేలా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ, ఏసీపీ రవికిరణ్‌రెడ్డి, ఎస్ఓటీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సేఫ్టీ మోకులపై గీత కార్మికులకు శిక్షణ

రాజాపేటలో సేఫ్టీ మోకులతో గీతన్నలకు శిక్షణ ఇస్తున్న ప్రతినిధులు

రాజాపేట, సెప్టెంబర్ 10 : మండల కేంద్రంలో గీత కార్మికులకు మంగళవారం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సేఫ్టీ మోకులతో తాటి చెట్టు ఎక్కే విధానంపై శిక్షణ ఇచ్చారు. గీత కార్మికులకు ఎలాంటి ప్రమాదం జరుగకుండా ఉండేందుకు సేఫ్టీ మోకులు తయారు చేసినట్లు కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అధికారులు, గీత కార్మికులు పాల్గొన్నారు.

వీరనారి ఐలమ్మ పోరాటం మరువలేనిది

- అదనపు కలెక్టర్ గంగాధర్
- జిల్లా వ్యాప్తంగా ఐలమ్మ వర్ధంతి

భువనగిరి కలెక్టరేట్ : కలెక్టర్ కార్యాలయంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్లు గంగాధర్, బెన్‌షాలోమ్, అధికారులు

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 10 : వీరనారి చాకలి ఐలమ్మ త్యాగం మరువలేనిదని అదనపు కలెక్టర్ గంగాధర్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్‌తో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐలమ్మ పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి యాదయ్య, డీఆర్డీఓ నాగిరెడ్డి, డీఎంహెచ్ఓ యశోద, డీపీఓ సునంద, జిల్లా ట్రెజరీ అధికారి సంపూర్ణ, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్యాంసుందర్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి జయపాల్‌రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి జగన్మోహన్ ప్రసాద్, జిల్లా ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు మందడి ఉపేందర్‌రెడ్డి, రజక సంఘం సభ్యులు రత్నపురం పద్మ, నగేశ్, శివకుమార్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని ఆలేరు పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల వద్ద ఆమె విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య మాట్లాడుతూ మహిళలు ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకొని సమాజ సేవలో భాగస్వాములు కావాలన్నారు. ఆలేరు మండలంలోని కొలనుపాకలో బాపూజీ రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజాపేట మండలంలోని పలు గ్రామాల్లో ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. గుండాలలోని గ్రంథాలయం ఆవరణలో ఐలమ్మ చిత్రపటానికి సీపీఎం, రజక సంఘం నాయకులు, ఆత్మకూరు(ఎం)లోని అంగడి ప్రదేశంలో ఐలమ్మ విగ్రహానికి అఖిలపక్ష నాయకులు, రజక సంఘం సభ్యులు నివాళులర్పించారు. బొమ్మలరామారంలోని బస్టాండ్ వద్ద, వలిగొండలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి రజక సంఘం నాయకులు నివాళులర్పించారు. చౌటుప్పల్ పట్టణంలోని ఐలమ్మ కాంస్య విగ్రహానికి రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నివాళుర్పించారు. బీబీనగర్‌లోని ప్రధాన కూడలిలో తెలంగాణ రజక రిజర్వేషన్ ఆధ్వర్యంలో, సంస్థాన్ నారాయణపురంలో శ్రీవెంకటేశ్వర రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి నివాళుర్పించారు. భూదాన్ పోచంపల్లిలో ఐలమ్మ కాంస్య విగ్రహానికి రజక సంఘం, సీపీఎం నాయకులు వేర్వేరుగా నివాళులర్పించారు.

చౌటుప్పల్ : ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

ఆత్మకూరు(ఎం)లో ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

బీబీనగర్ : ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

బొమ్మలరామారం : నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు

గణేశ్ నిమజ్జన ఏర్పాట్లు పరిశీలన

చౌటుప్పల్ రూరల్ : మండలంలోని దండు మల్కాపురం గ్రామ చెరువు వద్ద గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను ఏసీపీ మధుసూదన్‌రెడ్డి మగళవారం పరిశీలించారు. నిమజ్జనంలో ఎటువంటి అపశృతి జరుగకుండా తగు జాగ్రత్తలు పాటించాలని అధికారులకు సూచించారు. విద్యుత్, పంచాయతీ సెక్రటరీలు నిరంతరం పర్యవేక్షించాలని, రాజకీయ పార్టీల నాయకులు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని కోరారు.

వ్యక్తి ఆత్మహత్య

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబర్ 10 : మండలంలోని కొయ్యలగూడెం గ్రామ పరిధిలో అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరుకు చెందిన పోసకాడుగుల సుకుమార్ (33) హైదరాబాద్‌లో స్విగ్గీ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. అప్పులు ఎక్కువ కావడంతో తీర్చలేక మనస్థాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం మండలంలోని కొయ్యలగూడెం గ్రామ పరిధిలోని కుతుబ్ షాహీ మసీదు సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యాదవరెడ్డి తెలిపారు.

పేకాడుతున్న 9మంది అరెస్టు

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబర్ 10 : మండలంలోని దండు మల్కాపురం గ్రామంలో గల ఆండోళ్ మైసమ్మ దేవాలయం పరిధిలో పేకాట ఆడుతున్న 9మందిని అరెస్టు చేసినట్లు చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపారు. దండు మల్కాపురం గ్రామ పరిధిలోని లక్ష్మీ ఫంక్షన్‌హాల్‌లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడులు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి రూ.26,410 నగదు, 7సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దొంగలు అనుకొని యువకులకు దేహశుద్ధి

భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 10 : మండలంలోని దోతిగూడెం గ్రామంలో సోమవారం అర్ధరాత్రి దొంగలు అనుకొని ముగ్గురు యువకులకు దేహశుద్ధి చేశారు. బాధితుల వివరాల ప్రకారం.. గరిక లింగస్వామి, పగడాల ప్రకాశ్, పాపగళ్ల లక్ష్మీనారాయణ చౌటుప్పల్ మండలం చిన్నకొండూరు నుంచి సోమవారం రాత్రి పని నిమిత్తం బీబీనగర్‌కు వెళ్తున్నారు. మధ్యలో దోతిగూడెం గ్రామానికి చెందిన యాట లింగస్వామిని పలుకరించి పోదామని ఆయన ఇంటికి వెళ్లారు. ఈ సమయంలో లింగస్వామి ఇంటి పక్కనే ఉన్న యాట నరేశ్ వీరిని చూసి దొంగలు అంటూ పెద్దగా కేకలు వేశాడు. గణేశ్ మండపాల్లో పడుకున్న యువకులు, గ్రామస్తులు వచ్చి ఆ ముగ్గురిని పట్టుకొని చితకబాదారు. బాధితుడు పగడాల ప్రకాశ్ 100 నెంబర్‌కు ఫోన్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు వెంటనే వచ్చి విచారించారు. తాము లింగస్వామిని పలుకరించి బీబీనగర్‌కు వెళ్దామని వచ్చామని, నరేశ్ అనే వ్యక్తి దొంగలమని పట్టుకొని చితక బాదారని బాధితులు తెలిపారు. స్వల్ప గాయాలైన బాధితులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

బునాదిగాని కాల్వను తక్షణమే పూర్తి చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్

అడ్డగూడూరులో బైక్ ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్

మోత్కూరు/ అడ్డగూడూరు, సెప్టెంబర్ 10 : జిల్లాలో వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందించే బునాదిగాని కాల్వను పూర్తి చేసి గోదావరి జలాలు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ డిమాండ్ చేశారు. బునాదిగాని కాల్వ పూర్తి చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన బైక్ ర్యాలీని మంగళవారం అడ్డగూడూరులో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మోత్కూరు మున్సిపాలిటీలోని అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అడ్డగూడూరు, మోత్కూరు మండలాల్లోని పలు గ్రామాల్లో బైక్ ర్యాలీ కొనసాగింది. అనంతరం జహంగీర్ మాట్లాడుతూ జిల్లాలోని మత్తఅనంతారం నుంచి ప్రారంభమయ్యే బునాదిగాని కాల్వ 98 కిలోమీటర్ల పొడవు ఉందన్నారు. 20 ఏండ్లు గడిచినా 34కిలోమీటర్ల పని మాత్రమే జరిగిందని తెలిపారు. 64 కిలోమీటర్ల కాల్వను పూర్తి చేసేందుకు పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. బునాదిగాని కాల్వకు బస్వాపురం ప్రాజెక్టును అనుసంధానం చేసి గోదావరి జలాలను అందిస్తే ఈ ప్రాంత రైతాంగానికి సాగునీరు, ప్రజలకు తాగునీటి వసతి ఏర్పడుతుందన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కల్లూరి మల్లేశం, మాటూరి బాలరాజు, కొండమడుగు నర్సింహ, మోత్కూరు, అడ్డగూడూరు మండలాల కార్యదర్శులు వెంకట నర్సు, అనిల్‌కుమార్, రైతు సంఘం నాయకులు యాదిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కాల్వను పూర్తి చేయకుంటే ఉద్యమం ఉధృతం

ఆత్మకూరు(ఎం) : మండలానికి సాగునీరు అందించేందుకు నిర్మించిన బునాదిగాని కాల్వను పూర్తి చేయకుంటే రైతులతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. బునాదిగాని కాల్వ పూర్తి, గోదావరి జలాల సాధన కోసం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీపీఎం మండల కార్యదర్శి భిక్షం, నాయకులు సత్తయ్య, గోవర్ధన్, గోపాల్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, స్వామి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

'రాంగోపాల్‌రావు జీవితం ఆదర్శప్రాయం'

రాంగోపాల్‌రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గ్రామస్తులు, కుటుంబ సభ్యులు

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 10 : చందుపట్ల రాంగోపాల్‌రావు జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని వక్తలు కొనియాడారు. దేశ్‌ముఖి పంచాయతీ సమితి మాజీ అధ్యక్షుడు చందుపట్ల రాంగోపాల్‌రావు 93వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం మండలంలోని చందుపట్ల గ్రామంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చందుపట్ల గ్రామ సర్పంచుగా 20సంవత్సరాలు పనిచేసి గ్రామ అభివృద్ధికి, అవసరాల కోసం వందల ఎకరాల తన సొంత భూమిని దానం చేసిన మహనీయుడన్నారు. ఆయన అడుగుజాడల్లో నేటి యువత ముందుకు సాగి, ఆశయ సాధనకు పాటుపడాలని పిలుపునిచ్చారు. చందుపట్ల వెంకటేశ్వర్‌రావు, రాజేశ్వర్‌రావు, రామ్మోహన్‌రావు, సుజిత్‌రావు, రమేశ్, కిష్టయ్య, భాస్కర్, ప్రభాకర్, రాములు, పాపిరెడ్డి పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్‌కు విద్య నాంది : మహేందర్‌రెడ్డి

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కంప్యూటర్లు అందజేస్తున్న మహేందర్‌రెడ్డి

రామన్నపేట, సెప్టెంబర్ 10 : విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు నాణ్యమైన విద్యా బోధన నాంది పలుకుతుందని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెల్లంకి జిల్లా పరిషత్ పాఠశాలకు లక్షా ఇరువై వేల రూపాయల విలువైన ఐదు కంప్యూటర్లను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామన్నపేట లయన్స్ క్లబ్ తరపున ఎడ్ల మహేందర్‌రెడ్డి రెండు కంప్యూటర్లు, పదో తరగతి 1996-1997 బ్యాచ్ విద్యార్థులు ఒక కంప్యూటర్, తూడి మురళీధర్ ఒక కంప్యూటర్ సమకూర్చి పాఠశాలకు అందజేసినట్లు తెలిపారు. విద్యార్థుల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని ప్రధానోపాధ్యాయుడు తంగెళ్ల సురేందర్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత కూరెళ్ల విఠలాచార్య, తూడి మురళీధర్ పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే సునీత పరామర్శ

ఆలేరు టౌన్ : శశిప్రీతమ్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సునీతామహేందర్‌రెడ్డి నాయకులు

ఆలేరు టౌన్, సెప్టెంబర్ 10 : బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కో కన్వీనర్ కాసుల శశిప్రీతమ్ తండ్రి హరిబాబు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. మంగళవారం హరిబాబు దశదిన కర్మను పురస్కరించుకొని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత శశిప్రీతమ్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హరిబాబు కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని మనోధైర్యం కల్పించారు. పరామర్శించిన వారిలో ఆలేరు మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేశ్‌గౌడ్, కౌన్సిలర్లు బేతి రాములు, జూకంటి శ్రీకాంత్, ఏఎంసీ మాజీ చైర్మన్ జూకంటి శంకర్, నాయకులు ఉన్నారు.

రాజాపేట : మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు ఎర్రగోకుల జశ్వంత్ తల్లి సత్తమ్మ ఇటీవల మృతిచెందారు. మాజీ ఎమ్మెల్యే సునీత మంగళవారం జశ్వంత్‌ను పరామర్శించారు. సత్తమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆమె వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేశ్, నాయకులు మధుసూదన్‌రెడ్డి, నర్సిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, వీరేశం, వెంకటేశ్, శ్రీశైలం, వంశీ ఉన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్ : మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

బీఆర్ఎస్ పార్టీ ప్రమాద బీమా చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రామన్నపేట, సెప్టెంబర్ 10 : కార్యకర్తలకు అండగా ఉండేది బీఆర్ఎస్ పార్టీ ఒక్కటేనని సకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త కొద్ది నెలల క్రితం ప్రమాదవశాత్తు మృతిచెందాడు. పార్టీ సభ్యత్వం కలిగి ఉండటంతో అతనికి పార్టీ ప్రమాద బీమా నుంచి రెండు లక్షల రూపాయలు మంజూరయ్యాయి. ఆ చెక్కును మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మంగళవారం క్యాంప్ కార్యాలయంలో వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ప్రతి కుటుంబానికీ బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. అధికారం లేదని అధైర్యపడవద్దని, పార్టీ కోసం కష్టపడి పని చేసే కార్యకర్తలకు భవిష్యత్తులో తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోశబోయిన మల్లేశం, సిరిపురం గ్రామ శాఖ అధ్యక్షుడు బండ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ముత్తయ్య, వెంకటేశం, నాయకులు యాదయ్య, నర్సింహ పాల్గొన్నారు.

జిట్టా ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులతో ర్యాలీ

కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న యువజన సంఘాల నాయకులు, గ్రామస్తులు

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 10 : బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు జిట్టా బాలకృష్ణారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ మంగళవారం రాత్రి పట్టణంలోని రాయగిరిలో యువజన సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన సంఘాల నాయకులు మాట్లాడుతూ తెలంగాణ మలి దశ ఉద్యమానికి ఊపిరిలూదిన మహా నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి అన్నారు. అనారోగ్యంతో అకాల మరణం చెందిన ఆయన తెలంగాణ ప్రజల మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని పేర్కొన్నారు.

హైడ్రాతో పేదలను భయభ్రాంతులకు గురిచేస్తున్న ప్రభుత్వం

విలేకరులతో మాట్లాడుతున్న మహోదయ్

గుండాల, సెప్టెంబర్ 10 : హైడ్రా పేరుతో రేవంత్‌రెడ్డి సర్కార్ నిరుపేదలను భయభ్రాంతులకు గురి చేస్తుందని బీఆర్ఎస్ మండల కార్యదర్శి గడ్డమీది మహోదయ్ అన్నారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో నిరుపేదల ఇళ్లపైకి బుల్డోజర్లు పంపించి వారిని నిరాశ్రయులను చేస్తుందన్నారు. సంక్షేమ పథకాలు అడగకుండా ప్రజలను పక్కదోవ పట్టించడానికే హైడ్రాను తెరమీదికి తీసుకొచ్చారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో నిరుపేదల ఇండ్లకు పట్టాలు ఇచ్చి రెగ్యులర్ చేస్తే.. ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు ని